క్లుప్తంగా

అందరి సహకారంతోనే విజయవంతం

వైరా: వైరాలో ఈ నెల 24న నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతం కావడానికి ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త, స్థానిక అధికారులు చేసిన కృషి అభినందనీయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాబ్‌మేళాకు 8,889మంది దరఖాస్తు చేసుకోగా మొదటి విడతగా 2,504మంది, రెండో విడతలో 1,540మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరందరికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, జైపాల్, వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

ఎర్రుపాలెం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సీపీఎంకు ప్రజల్లో ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వీరయ్య, మండల కార్యదర్శి ప్రభాకర్, మండల కమిటీ సభ్యులు తదితరులున్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి అవార్డు

వైరా: వైరాకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు బత్తుల సుజాతకు మోటివేషనల్ విడినార్ లోడింగ్ అవార్డు లభించింది. ఈ నెల 25న హైదరాబాద్‌లోని హోటల్ అశోకా గ్రాండ్‌లో గ్లోబల్ ఎడ్యుకేటర్స్, అచీవర్స్ సంస్థ వారు నిర్వహించిన కార్యక్రమంలో జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు సుజాత తెలిపారు.

బీమా నగదు అందజేత



నగదు అందిస్తున్న సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం సొసైటీ పరిధిలోని బనిగండ్లపాడుకు చెందిన బుద్ధా సీతామహాలక్ష్మి ఇటీవల మృతి చెందింది. ఆమె సొసైటీలో గ్రూపు ఇన్సూరెన్స్ చేయించడంతో.. రూ.50వేలు నగదు మంజూరైంది. సోమవారం బనిగండ్లపాడు సొసైటీ కార్యాలయంలో చైర్మన్ శీలం అక్కిరెడ్డి నామిని శ్రీనివాసరావుకు నగదు అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ సూపర్‌వైజర్ సుధాకర్, సిబ్బంది తదితరులున్నారు.

సైకిల్ యాత్రను విజయవంతం చేయండి

తల్లాడ: డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూన్ 1న మండలంలోకి ప్రవేశించే యువ చైతన్య సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు సత్తెనపల్లి నరేష్ అన్నారు. తల్లాడలో ఆయన డీవైఎఫ్ఐ సమావేశంలో ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మదక ద్రవ్యాలను నిషేధించి, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

బదిలీ కానిస్టేబుల్‌కు సన్మానం



బాలాజీని సన్మానిస్తున్న స్థానికులు

తల్లాడ: తల్లాడలో ఏడేళ్లపాటు పనిచేసిన కానిస్టేబుల్ బానోత్ బాలాజీ.. ఖమ్మం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ బదిలీ అయ్యారు. దీంతో సోమవారం బాలాజీని పలువురు శాలువాలతో ఘనంగా సన్మానించి.. ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తల్లాడ ఎస్సై బి.కొండల్‌రావు, ఎర్రి నరసింహారావు, వరికొల్లి వంశీ, వీరబాబు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

చింతకాని: కడపలో జరిగే టీడీపీ మహానాడుకు టీడీపీ మండల నాయకులు సోమవారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు, నాయకులు కరణం తిరుమలరావు, లగడపాటి నాగేశ్వరరావు, కొంగర రామారావు, ముప్పాళ్ల కోటేశ్వరరావు, తాళ్లూరి రాము, దాసరి లక్ష్మీనర్సయ్య, పెద్దగొండ్ల వెంకటనారాయణ, బండి ప్రసాద్, లగడపాటి జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో..
రైతుల అవస్థలు



బోనకల్ కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

- రోజులు గడుస్తున్నా కాంటాలు వేయరా..?
- వర్షాలతో వడ్లు తడవకుండా రైతుల పాట్లు
- కేంద్రం ఎత్తివేసామంటున్న అధికారులు



ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు

బోనకల్: మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధ్యాన్యం కాంటా వేయక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెలరోజుల క్రితం అధికారులు రైతుల నుంచి ఒత్తిడి రావడంతో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల పాటు ధాన్యాన్ని కొనుగోలు చేసిన అధికారులు.. పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకుండా అర్థాంతరంగా కొనుగోలు కేంద్రాన్ని నిలిపివేయడంతో ఏం చేయాలో తెలియక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైతుల ఇబ్బందులు..

రోజుల తరబడి వేచి ఉన్న రైతులు ధాన్యం కొనకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలు కూడా వస్తుండడంతో రైతులు తమ ధాన్యం తడవకుండా టార్పాలిన్లు వేస్తూ పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాల్లో ఎలాంటి కాపలా లేకపోవడంతో రాత్రి సమయాల్లో రైతులే కాపలా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత పది రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే పోసి కాంటా కోసం ఎదురుచూస్తున్నామని రైతులు తెలిపారు.

మాట మారుస్తున్న అధికారులు..

కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు నిలిపివేశామని మండలంలోని మరో సెంటర్‌కు తీసుకెళ్లాలని అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. అయితే చిరునోముల, ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం గ్రామాల నుంచి ధాన్యాన్ని తీసుకువచ్చామని, మరలా ఇక్కడి నుంచి మరొక కేంద్రానికి తీసుకెళ్లాలంటే ట్రాన్స్‌పోర్టు కష్టతరమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగా వచ్చిన ధాన్యాన్ని కొనుగోళ్లు చేయకపోతే దళారులు తక్కువ ధరకు అడిగే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇక్కడే ధాన్యం కొనుగోలు చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

వారం రోజులుగా ఇక్కడే..



నేను ఐదు ఎకరాల్లో వరిసాగు చేశాను. కోత ఆలస్యంగా వచ్చింది. వారంరోజుల క్రితం ట్రాక్టర్ ద్వారా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. వీరేమో కాంటా వేయడం లేదు. వారం నుంచి ప్రతిరోజు వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. ఇకనైనా అధికారులు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి.

– ఆముదాల శ్రీను, రైతు, చిరునోముల

మరో కేంద్రానికి రమ్మంటున్నారు..



పదిరోజుల క్రితం ధాన్యన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. అధికారులు రోజూ కాంటా వేస్తామని చెబుతున్నారే తప్ప తీసుకోవడం లేదు. అదేంటని ప్రశ్నిస్తే కేంద్రం ఎత్తివేశామని రామాపురం సెంటర్‌కు తీసుకురావాలని చెబుతున్నారు. అక్కడకు తీసుకెళ్లాలంటే కూలీలు, ట్రాక్టర్ ఖర్చు యాతన అవుతుంది.

– బండం నాగేశ్వరరావు, రైతు, ముష్టికుంట్ల

కాంగ్రెస్‌తోనే రైతులకు న్యాయం



రూ.25లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులందరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సింగరేణి ఎస్‌టీఆర్ కెనాల్‌లో భూములు కోల్పోయిన.. రేజర్ల, కొత్తూరు గ్రామాలకు చెందిన 25మంది రైతులకు నష్టపరిహారం కింద రూ.25లక్షల చెక్కులను సోమవారం అందించారు. దీంతో రైతులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ముదిగొండ: ముదిగొండలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఎంఏఓ సరిత, ఎస్సై అనంతరాములు సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, రికార్డులను వారు పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని, నకిలి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్‌లు లేని దుకాణాలు సీజ్ చేస్తామని తెలిపారు.

పాలాభిషేకం

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామంలో సోమవారం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కిషోర్ పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టి విక్రమార్క ఫ్లెక్సీలకు.. జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహం వద్ద పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, రామప్పారావు, రమేష్, నాగులు మీరా పాల్గొన్నారు.

తిరంగా శాంతి ర్యాలీ

వైరా: ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో బీజేపీ ఆధ్వర్యంలో అఖిలపక్షం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ వద్ద నుండి రింగ్ రోడ్డు సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి జయభారత్ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, సురేందర్, రవి, రాఘవరావు, చలపతి, ప్రదీప్, సుమంత్, డాక్టర్ కాపా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కారేపల్లి: మండలంలోని పంతుల్‌నాయక్‌తండా గ్రామంలో కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లను మాజీ సర్పంచ్ బానోత్ కుమార్, మాజీ ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించటం వలన యువకుల్లో నాయకత్వ లక్షణాలు అలవరుతాయని, చెడువ్యసనాలకు దూరంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కింగ్స్ యూత్ సభ్యులు తేజావత్ రాంజీలాల్, కెలోతు కోటేష్, థామస్, శ్రీనివాస్, గణేష్, శ్యామ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పూర్వ విద్యార్థినులకు వృత్తి నైపుణ్య శిక్షణ

ఎర్రుపాలెం: స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల పూర్వ విద్యార్థినులకు ప్రభుత్వం చొరవతో ఉన్నతి ఫౌండేషన్ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని, దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల పిన్సిపాల్ సీహెచ్ జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 నుంచి ఎర్రుపాలెంలోని సాంఘీక సంక్షేమ కళాశాలలో చదువుకొని 19–25 సంవత్సరాల వయస్సుండి ఎలాంటి ఉద్యోగం రానివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో తప్పిన ప్రమాదం



శ్లాబు పెచ్చులూడిన ప్రాంతంలో పరిశీలిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో శిథిలా భవనం శ్లాబు పెచ్చులూడి కిందపడ్డాయి. ఈ ఘటన సెలవుదినమైన ఆదివారం జరగడంతో అధికారులు, సిబ్బందికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సోమవారం విధులకు హాజరైన అధికారులు పరిస్థితి తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు. అదే విధంగా కార్యాలయానికి వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డిలు.. ఆ దృశ్యాలను ఎంపీడీఓ బి.సురేందర్‌తో కలిసి పరిశీలించారు. సమస్యను భట్టి దృష్టికి తీసకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

చెరువు తూము షట్టర్లకు మరమ్మతులు



చెరువు తూము షట్టర్లకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు ఊర చెరువు తూముల షట్టర్లకు మరమ్మతుల పనులను జల వనరుల శాఖాధికారులు ప్రారంభించారు. ఈ నెల 21న «ప్రశ్నార్థకంగా ఆయకట్టు» అనే శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. చెరువులోని తూముల వద్ద ప్రొక్లయినర్‌తో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ టి.సాంబశివరావు మాట్లాడుతూ. నాలుగైదు రోజుల్లో తూము షట్టర్లు మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు.

అయ్యవారిగూడెంలో పారిశుద్ధ్య చర్యలు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెంలో సైడ్ డ్రెయిన్లు పూడిక ఎక్కువగా ఉండడంతో నీరు పారక అపరిశుభ్రంగా తయారైంది. విషయాన్ని గ్రామస్తులు.. బీమవరానికి చెందిన కాంగ్రెస్ నాయకులు యరమల పూర్ణచంద్రారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన తన సొంత ఖర్చులతో పూడిక తీయించడంతో స్థానికులు అభినందించారు.

గుండెపోటుతో మహిళ మృతి

తల్లాడ: మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన దాసరి శోభారాణి(47) ఆదివారం రాత్రి విందులో పాల్గొనేందుకు వెళ్లగా గుండెపోటుతో మృతి చెందింది. ఆమె బంధువుల విందులో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లగా అక్కడ గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందిన శోభారాణి మృతదేహాన్ని సోమవారం మల్లవరం తీసుకురాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కాపా సుధాకర్, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

రిటైర్డ్ ఉద్యోగి భార్య మృతిపై సంతాపం..

సత్తుపల్లిటౌన్: విశ్రాంత మండల విద్యాధికారి, పెన్షనర్ల సంఘం నాయకుడు వనమారెడ్డి చెంచిరెడ్డి భార్య భారతి(75) సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ కన్నుమూశారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు బద్రుద్దీన్, ఏఎస్.ప్రకాశరావు, డి.కృష్ణయ్య, వెంకటరత్నం, సత్యనారాయణ, దాసు, పూర్ణచంద్రరావు, సత్యనారాయణ ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

రేకుల ఇల్లు కూల్చివేతపై విచారణ

కారేపల్లి: మండలంలోని కారేపల్లిక్రాస్‌రోడ్డులో మూతి చంద్రశేఖర్ స్వాధీనంలో ఉన్న రేకుల ఇల్లును కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. దీంతో ఆయన ఈ నెల 24న కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సోమవారం ఎస్సై ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి



తల్లాడ: మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

తల్లాడ/ఏన్కూరు: ప్రకృతి వైపరీత్యాల పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్లు సురేష్‌కుమార్, సీహెచ్.శేషగిరిరావు తెలిపారు. సోమవారం తల్లాడ, ఏన్కూరు మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరదల సమయంలో విద్యుత్, వైద్య, వ్యవసాయ శాఖల పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చర్చించారు. వరదల వల్ల పంటల నష్టం జరిగితే తక్షణమే నష్ట నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలో సరిపడా మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్లో అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలన్నారు. అంతకు ముందు తల్లాడలో జరిగిన ప్రజావాణిలో ఇద్దరు దరఖాస్తులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు జీఎస్.నారాయణ, సురేష్‌బాబు, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, ఏఓ తాజుద్దీన్, వైద్యాధికారి రత్న మనోహర్, ఎస్సై బి.కొండల్‌రావు, ఏపీఓ కోటయ్య, ఏపీఎం అశోకారాణి, విద్యుత్ ఏఈ ప్రసాద్, ఈఓ కృష్ణారావు పాల్గొన్నారు.

రైతులకు జీలుగు విత్తనాలు అందజేత



వైరా: జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, తదితరులు



ఎర్రుపాలెం: తక్కెళ్లపాడులో జీలుగులు అందిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అధికారులు

వైరా: తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీ పై అందజేస్తున్న జీలుగు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం వైరాలో జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పీసీసీ కార్యదర్శి రంగారావు, నాయకులు పాల్గొన్నారు.

మధిర: మధిర సొసైటీలో సోమవారం రైతులకు వరి, జీలుగు విత్తనాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తిని పెంచడంలో విత్తనం ఒక కీలకమైన వనరు అని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కృష్ణప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం, రాజుపాలెం సొసైటీ కార్యాలయాల్లో జీలుగులను రైతులకు డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు.. మధిర ఏడీఏ విజయ్‌చంద్ర, మండల ఏఓ సాయిశివతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారావు, బాషా, బాబురావు, ఏఈఓలు తదితరులున్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ అవినాష్

సత్తుపల్లిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ రహిత సమాజం కోసం వైద్య సేవలు విస్తృతంగా అందించాలని గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్.అవినాష్ అన్నారు. సోమవారం ఆస్పత్రిలో జరిగిన సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. సత్తుపల్లి సీహెచ్‌పీలో వ్యాక్సినేషన్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, శారారాణి, విజయకుమారి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కల్లూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఈవీ రమేష్ తెలిపారు. సోమవారం బీజేపీ నాయకులు ఆర్డీఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం అర్హులకు అందించాలని కోరుతూ ఆర్డీఓ ఎల్.రాజేందర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. అనర్హులకు లబ్ధి చేకూరితే అర్హులతో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జొన్నలగడ్డ నరేష్, మండల అధ్యక్షులు గుమ్మా రామకృష్ణ, సాలి శివకృష్ణ, చల్లా నాగులు, గుండపనేని అనీల్, బొర్రా నరసింహారావు, పర్సా రాంబాబు, జాలా అప్పారావు, తుమ్మలపూడి పుల్లారావు, దొడ్డపునేని వెంకటేశ్వరరావు, రంగు రవి, మండవ వెంకటరామిరెడ్డి, ఆనంగి నరసింహారావు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దక్కేనా..?



కొణిజర్లలో దరఖాస్తు చేసుకుంటున్న స్థానికులు (ఫైల్)

- జూన్ 2నుంచి పంపిణీకి సిద్ధమవుతున్న అధికారులు
- కొర్రీలు పెడుతున్న బ్యాంకర్లు
- మండలంలో 3,824 దరఖాస్తులు

కార్పొరేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1,264 దరఖాస్తులు రాగా.. ఓబీసీ ద్వారా 1,678, ఎస్టీకి 703, మైనార్టీ, క్రిష్టియన్ కార్పొరేషన్ల ద్వారా 179 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 3,824 మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో అర్హులను గుర్తించి అధికారులు బ్యాంకర్ల ద్వారా రుణాలు ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.4 లక్షల వరకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

కొణిజర్ల: నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఏప్రిల్ 14వరకు మండలంలో దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో మొత్తం 27 పంచాయతీలుండగా 3,824 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండలంలో లబ్ధిదారుల జాబితాను జిల్లా కమిటీని అందించనుండగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అమోదంతో జూన్ 2న అర్హులైన లబ్ధిదారులకు యువ వికాసం పథకం కింద రుణాలు ఇవ్వనున్నారు.

సిబిల్ స్కోర్ మెలిక..

సబ్సిడీ రుణాల మంజూరు విషయంలో బ్యాంకు అధికారులే కీలక పాత్ర పోషించనున్నారు. దరఖాస్తులను మండల కమిటీ పర్యవేక్షిస్తుంది. ఎంపీడీఓ కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రత్యేకాధికారి, బ్యాంకు మేనేజర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ప్రతినిధులు కమిటీలో ఉండగా బ్యాంకు అధికారుల పాత్ర ముఖ్యంగ ఉంది. ఎందుకంటే లబ్ధిదారుల సిబిల్‌స్కోర్ సంతృప్తి చెందితేనే బ్యాంక్ రుణం ఇచ్చే అవకాశం ఉంది.


గతంలో చేదు అనుభవాలు..

రాజీవ్ యువ వికాసం పథకానికి ముందు గత ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు రుణాలు అందించేవి. బ్యాంక్ లింకేజీ రుణాల మంజూరులో సమస్యలు ఎదురయ్యాయి. లబ్ధిదారులు బ్యాంకులు ఇచ్చిన రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బ్యాంకు లింకేజీలతో సంబంధం లేకుండా దళిత బంధు, బీసీబంధు, మైనార్టీ బంధు పేరుతో రుణాలు ఇచ్చింది. అయితే గ్రామానికి ఒకటి రెండు మించి రాకపోవడంతో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు కూడా రాజీవ్ యువ వికాసం పథకం కూడా అలాగే ఉండే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గ్రామాల్లో పైరవీలు..

రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో గ్రామాల్లో రాజకీయ పైరవీలు మొదలయ్యాయి. రుణాలు మంజూరు విషయంలో తాము కీలక పాత్ర వహిస్తామని తమకు సబ్సిడీలో సగం ఇవ్వాలని రాజకీయ నాయకులు లబ్ధిదారులతో చెబుతున్నట్లు సమాచారం. ఉదాహరణకు రూ.4 లక్షలు మంజూరు అయితే లబ్ధిదారుడి వాటా రూ.1.20 లక్షలు పోను వచ్చే రూ 2.80 లక్షలతో సగం తమకు ఇవ్వాలని నాయకులు పట్టు బడుతున్నారని పలు గ్రామాలలో చర్చ జరుగుతుంది. ఈ విషయముపై నాయకులు బ్యాంకర్లతో మంతనాలు జరిపినట్లు సమాచారం.

పైరవీకారులను నమ్మొద్దు..



మండలంలో ఎవరూ పైరవీకారులను నమ్మి మోసపోవద్దు. బ్యాంకుల నుంచి నేరుగా లబ్ధిదారుడి ఖాతాకే రుణం వస్తుంది. రూ.50 వేలు లోపు యూనిట్లుకు నేరుగా చెక్కులు అందజేయడం జరుగుతుంది. రూ. లక్షకు రూ.10 వేలు, రూ.2 లక్షలకు 20శాతం అంటే రూ 40 వేలు, రూ.4 లక్షలకు 30శాతం రూ.1.20 లక్షలు లబ్ధిదారుడి వాటా బ్యాంకులో చెల్లించాలి. మిగిలినవి బ్యాంక్ సబ్సిడీ ఇస్తుంది. మండల స్థాయి కమిటీ ఎంపిక చేసిన వారికే రుణాలు వస్తాయి.

– ఏ.రోజారాణి, ఎంపీడీఓ, కొణిజర్ల